వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 174 మంగళవారం | 09 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

8లో



## నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం: ఆర్‌సి తడక కుమార్ స్వామి గౌడ్



8లో..

## ఐనవోలు జాతరకు రండి

సీఎంకు ఆహ్వాన పత్రిక అందించిన మంత్రి, ఎమ్మెల్యే



8లో..

## కాగడాలు, కాకర వత్తులతో హారతి

అంగరంగ వైభవంగా సాగుతున్న ధనుర్మాసోత్సవాలు



8లో..

## మిర్చికి రూ.25వేలు మద్దతు ధర ప్రకటించాలి

మార్కెట్ దోపిడీని అరికట్టాలి, తాలుకు జెండా పాట పెట్టాలి

ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్




# ఇక 23 జిల్లాలే?


## మార్చే దిశగా సర్కార్ అడుగులు

కమిషన్ ఏర్పాటుతో పాటు జిల్లాల పునర్వ్యవస్థీకరణ

ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

మండలాలు, రెవెన్యూ డివిజన్లపై పునరాలోచన

రాష్ట్రాన్ని ముక్కలు, చెక్కలు చేసిన గత ప్రభుత్వం



జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్ల పేరుతో రాష్ట్రాన్ని ముక్కలు చెక్కలు చేయడంపై ప్రభుత్వం పునరాలోచనలో పడిందా..? పది జిల్లాల తెలంగాణను అప్పటి సీఎం కేసీఆర్ లక్కీ నంబర్ 6 వచ్చేలా 33 జిల్లాలుగా మార్చారనే విమర్శల నుంచి బయట పడేలా చర్యలు చేపట్టారా..? కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటులో జరిగిన లోపాలను సవరించి శాస్త్రీయంగా, పాలనా యోగ్యంగా ఏర్పాటుకు కసరత్తులు ప్రారంభమయ్యాయా..? ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలను 23కు కుదించనున్నారా.. అంటే అవుననే సమాధానం లభిస్తోంది. ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా అశాస్త్రీయంగా జరిగిన 33 జిల్లాల ఏర్పాటుపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం హాట్ టాపిక్ గా మారింది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

# ఇక 23 జిల్లాలే?

**మార్పే దిశగా సర్కార్ అడుగులు**

**కమిషన్ ఏర్పాటుతో పాటు జిల్లాల పునర్వ్యవస్థీకరణ**

**ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి**

**మండలాలు, రెవెన్యూ డివిజన్లపై పునరాలోచన**

**రాష్ట్రాన్ని ముక్కలు, చెక్కలు చేసిన గత ప్రభుత్వం**




**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాజకీయ అవసరాల కోసం బీఆర్ఎస్ సర్కారు అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన 33 జిల్లాల పునర్వ్యవస్థీకరణ దిశగా సర్కార్ అడుగులు వేస్తోంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. దీంతో జిల్లాల సంఖ్య కుదింపు జరుగనుందన్న వార్త ట్రెండింగ్ మారింది. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జులను పాత పది ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా నియమించినట్లు ప్రచారం సాగుతోంది. పది జిల్లాల తెలంగాణను అప్పటి సీఎం కేసీఆర్ లక్కీ నంబర్ 6 వచ్చేలా 33 జిల్లాలుగా మార్చారనే విమర్శల నేపథ్యంలో శాస్త్రీయంగా, పాలనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రీ ఆర్గనైజేషన్ చేసే పనిలో పడింది. అదే జరిగితే రాష్ట్రంలో ఎన్ని జిల్లాలవుతాయనేది చర్చనీయాంగా మారింది. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ 625 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. గ్రేటర్ పరిధిలో 24 నియోజకవర్గాలున్నాయి. ముఖ్యంగా సికింద్రాబాద్ పేరుతో జిల్లానే లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. గ్రేటర్ లో అంతర్భాగమైన ఉప్పల్, మల్కాజ్ గిరి, కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్ తదితర సెగ్మెంట్లు మేడ్చల్ జిల్లాలో మెర్జ్ చేశారు. పటాన్ చెరు సెగ్మెంట్ గ్రేటర్‌లో ఉన్నా సంగారెడ్డి జిల్లాలోనే కొనసాగుతోంది. రాజేంద్రనగర్, ఎల్బీనగర్ సెగ్మెంట్లు గ్రేటర్ పరిధిలో కొనసాగుతున్నా అవి రంగారెడ్డి జిల్లా కిందకు వస్తున్నాయి. కేవలం జీహెచ్ఎంసీ పరిధినే నాలుగు జిల్లాలుగా విభజించే అవకాశం ఉన్నా.. సర్కారు ఆ దిశగా అడుగులు వేయలేదనే విమర్శలున్నాయి. అదే విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు జిల్లాలుగా ఏర్పాటు చేశారు. దీంతో కేవలం ఒక నియోజకవర్గం ఒక జిల్లాగా మారి దాని అస్తిత్వాన్ని కోల్పోయింది. కేవలం ములుగు నియోజకవర్గంతో ములుగు జిల్లాను ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. వీటన్నింటినీ సవరించి జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

### రిటైర్డ్ జడ్జితో కమిషన్..

జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్ల విభజనలో గత ప్రభుత్వం ఎలాంటి ప్రమాణాలు పాటించలేదన్న ఆరోపణలున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జిల్లాల పునర్వ్యస్థీకరణకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటులో జరిగిన లోపాలను సవరించి శాస్త్రీయంగా, పాలనా



యోగ్యంగా ఏర్పాటు చేయాలన్నది సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం.

### ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాలు..

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 23 జిల్లాలుండగా 10 జిల్లాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. ఆ తర్వాత రాజకీయ అవసరాలకు, సంబంధిత ప్రాంతంలో ఉన్న నాయకుల ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు బీఆర్ఎస్ సర్కారు 33 జిల్లాలను ఏర్పాటు చేసిందనే విమర్శలున్నాయి. అయితే ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగానే తెలంగాణలో 23 జిల్లాలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏపీలో మాదిరిగా పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా మార్చుతారా..? మరేదైనా శాస్త్రీయ పద్ధతిని ప్రామాణికంగా తీసుకొని జిల్లాలను పునర్వ్యవస్థీకరిస్తారా..? అన్నది హాట్ టాపిక్ గా మారింది.

### మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటులోనూ..

మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటులోనూ గత ప్రభుత్వం ఇష్టారీతిగా వ్యవహరించింది. గతంలో 37 రెవెన్యూ డివిజన్లుండగా వాటిని 74కు మార్చింది. 464 మండలాలను 607కు పెంచింది. మండలాల ఏర్పాటులో ఎలాంటి శాస్త్రీయ పద్ధతిని అవలంబించలేదనే విమర్శలున్నాయి. నాలుగైదు గ్రామాలతో కూడిన మండలాలు సైతం ఉండటం అనేక విమర్శలకు తావిచ్చింది. ఒకటిన్నర, రెండు నియోజకవర్గాలతో జిల్లాల ఏర్పాటుపైనా విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో అప్పట్లో ఉన్న ఇన్ చార్జి మంత్రుల వ్యవస్థను కూడా బీఆర్ఎస్ సర్కారు నిర్వీర్యం చేసింది. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేలకు ఒక జిల్లా అన్నట్టుగా తయారైంది. జిల్లా పరిషత్ సమావేశం జరిగినా, జిల్లా సమీక్షా సమావేశాలు జరిగినా వాటికి ప్రాధాన్యం లేకుండా పోయింది.

### అడిగిందే తడవుగా..

అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏదైనా మీటింగ్, ఇతర ఏదైనా కార్యక్రమానికి హాజరైన సందర్భాల్లో జిల్లా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ రాగానే వారం రోజుల్లో కొత్త జిల్లాను ఏర్పాటు చేస్తూ జీవో విడుదలయ్యేది. మండలాల ఏర్పాటు విషయమైతే ఎలాంటి అధ్యయనం లేకుండా జరిగిపోయిందనే విమర్శలు వచ్చాయి. పరిపాలనను చేరువ చేస్తున్నామని చెప్పుకొంటూ నాలుగైదు గ్రామాలను కలిపి మండలంగా ఏర్పాటు చేశారు తప్ప వాటికి సరిపడా ఆఫీసులు ఏర్పాటు చేయకపోవడం, అధికారులను నియమించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పాలన సాగింది. ప్రజల కష్టాలు కూడా తీరలేదు. వీటన్నింటిపై దృష్టి సారించిన కాంగ్రెస్ సర్కారు శాస్త్రీయంగా, పాలనకు అనుకూలంగా జిల్లాలను పునరుద్ధరించేందుకు సిద్ధమవుతోందని తెలుస్తోంది.



# నమ్మిన వారే నట్టేట్ట ముంచారు

## మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

**వరంగల్ వాయిస్, మరిపెడ :** నమ్మిన వారే నట్టేట్ట ముంచారని, నమ్మించి మోసం చేశారని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మరిపెడ పట్టణ కేంద్రంలోని నవీన్ రావు గెస్ట్ హౌస్ లో మంగళవారం డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నియోజక వర్గంలో టెండర్లు పూర్తైన రూ.300 కోట్ల పనులకు ఆటంకం కలిగించకుండా అభివృద్ధి పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ అనుమతితోనే పనులకు చుట్టామన్నారు. నియోజక వర్గ ప్రజలపై నిజంగా ప్రేమ ఉంటే నిధులు లేవనే సాకుతో పనులను చేయకుండా ప్రజలను మోసం చేయవద్దన్నారు. మరిపెడ మండల కేంద్రంలో గత ప్రభుత్వం హయాంలో మంజూరైన 100 పడకల ఆస్పత్రిని త్వరిత గతిన పూర్తి చేయలని డిమాండ్ చేశారు. నియోజక వర్గంలో 53 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలవడం భాదను కలిగించిందన్నారు. గిరిజనులకు తన పైన ఉన్న వ్యతిరేకతతో పాటు గ్రామీణ స్థాయిలోకూడా ఓట్ల శాతం తగ్గడంతో ఓటమి చెందినట్లు తెలిపారు. ఈ ఓటమి మహా మహుల విజయం కాదన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నానన్నారు. ఇంతకు ముందు ఒక లెక్క ఇప్పుడొక లెక్కని హామీలు అమలు చేయకుంటే ఆందోళనకు కూడా సిద్ధమన్నారు. కార్యకర్తలు అధైర్య పడొద్దని, ఆపద వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్ రెడ్డి, యువనేత డీఎస్ రవిచంద్ర, రాంలాల్, ఏడు మండలాల అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అవినీతిపై కదలిక

**మేడిగడ్డ కుంగుబాటుపై విజిలెన్స్ విచారణ**

**ఈఎన్సీ కార్యాలయంలో సోదాలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయిస్తామని కొద్ది రోజులుగా ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కార్యరూపంలోకి వచ్చాయి. ముందస్తుగా మేడిగడ్డ కుంగుబాటుపై విచారణను విజిలెన్స్ కు అప్పగించారు. మేడిగడ్డ కుంగుబాటుకు కారణాలేమిటో తేల్చాలంటూ విజిలెన్స్ ను ఆదేశించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గతంలోపే ప్రకటించారు. ఈ మేరకు జలసౌధలోని ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం పన్నెండు చోట్ల సోదాలు జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేసేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో ఆలోపు బ్యారేజీ కుంగుబాటుకు కారణాలు, బాధ్యులైన అధికారులను విజిలెన్స్ విచారణలో గుర్తించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ఘటనను రేవంత్ రెడ్డి సర్కార్ సీరియస్‌గా తీసుకుంది. ఈ వైఫల్యం వెనుక కేసీఆర్ సర్కార్‌లో బాధ్యత ఎవరు అనేదానిపై ఫోకస్ పెట్టింది. ఇటీవలే మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన మంత్రుల బృందం అక్కడే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సైతం ఇచ్చింది. ఈ క్రమంలో విజిలెన్స్ విచారణకు ఆదేశించడం ఆసక్తికర పరిణామంగా మారింది. కాళేశ్వరం అవినీతిపై న్యాయవిచారణ చేయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. తర్వాత ఉత్తమ్ కుమార్ రెడ్డి పలుమార్లు అదే ప్రకటన చేశారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.4,600 కోట్లు ఖర్చు చేసినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మహాదేవపూర్ ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో రికార్డులను విలువైన పత్రాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం పరిశీలిస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ, కన్నేపల్లి పంప్ హౌస్‌లకు సంబంధించిన కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. పది ప్రత్యేక బృందాలతో దాడులు కొనసాగుతున్నాయి. మొత్తం 12 ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. తెలంగాణ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీ వంతెన కుంగిన వార్త రాష్ట్రంలో పెను దుమారాన్ని రేపింది. బ్యారేజీలోని బీ బ్లాక్ పరిధిలో గల 18,19,20,21 పిల్లర్ల వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఒక పిల్లర్ 1.2 మీటర్లు కుంగిందని.. మరో మూడు పిల్లర్లపై ఆ ప్రభావం పడిందని పరిశీలనలో తేలింది. అయితే మేడిగడ్డ ప్రాజెక్ట్ కుంగడంపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు దుమ్మెత్తిపోశాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం కోట్లు ఖర్చుపెట్టామని చెప్పి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించారని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కుంగిన మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. అప్పటి బీఆర్ఎస్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. అయితే కాళేశ్వరం అంశం రాజకీయంగానూ కలకలం రేపుతోంది. సీబీఐ విచారణకు సిఫారసు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణకు డిమాండ్ చేసిందని గుర్తు చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం.. తామే విచారణ చేస్తామని.. లోగుట్టు మొత్తం బయటకు తీస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో విజిలెన్స విచారణ ప్రారంభం కావడం రాజకీయవర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్ హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచాలని ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నాడిమాండ్ చేశారు. 2018 సంవత్సరంలో జీవో నెంబర్ 510 విడుదల చేసి కొంతమంది నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచారని మిగతా 4500మందికి పైగా ఉద్యోగులకు వేతనాలు పెంచలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో గత 20ఏళ్ళుగా పనిచేయుచున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పబ్లిక్ హెల్త్ మేనేజర్, అకౌంటెంట్, సపోర్టింగ్ స్టాఫ్, మెడికల్ అసిస్టెంట్, స్వీపర్, వాచ్ మెన్, బ్లాక్ లెవెల్ అకౌంటెంట్, ప్రైమరీ హెల్త్ సెంటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్, సీహెచ్ సీ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, బస్తీ దవాఖాన సపోర్టింగ్ స్టాఫ్, ఎన్ సీడీ కౌన్సర్ల్స్, న్యూట్రిషన్ కౌన్సర్ల్స్, డెంటల్ టెక్నీషియన్ , ఫీజియోథెరపిస్ట్ , సోషల్ వర్కర్, ఎంసీహెచ్ సెక్యూరిటీ గార్డ్స్, పీ హెచ్ సీ కాంటిజెంటీ వర్కర్లకు డ్రైవర్లకు గత అనేక సంవత్సరాలుగా తీవ్ర అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 51 ప్రకారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పబ్లిక్ హెల్త్ మేనేజర్ రూ.40000, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సపోర్టింగ్ స్టాప్ కు రూ.19000, పీహెచ్ సీ కాంటిజెంటీ వర్కర్లకు రూ.19000, బస్తీ దవాఖాన సపోర్టింగ్ స్టాఫ్ రూ.26000, రాష్ట్ర ప్రభుత్వం జీవో 51 ప్రకారం జీతాలు మాత్రం పెంచడం లేదని వారు విమర్శించారు. సిబ్బంది జీతాల పెంపుదల కోసం గతంలో అనేక పర్యాయాలు కమిషనర్ కు వివరించామన్నారు. అయినా కూడా సమస్యలను పరిష్కరించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. వెంటనే జీతాలు పెంచాలని, లేకుంటే భవిష్యత్తు కార్యాచరణకు రూపకల్పన చేసి, మార్చి రెండో వారంలో ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. త్వరలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్, చీఫ్ సెక్రటరీ, ఎమ్మెల్యేలకు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, ముఖ్య మంత్రికి అందజేయడం జరుగుతుందన్నారు.

## కస్తూర్బా పాఠశాల ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, ములుగు :** వాజేడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ములుగు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.శ్రీజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంటగది , స్టోర్ రూమ్ పరిశీలించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాజేడు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్క విజయంతో మొక్కు చెల్లించిన జంగా సంతోష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ములుగు :** వెంకటాపూర్ మండలం బూర్గుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జి జంగా సంతోష్ రెడ్డి మంగళవారం తిరుపతిలో మొక్కు చెల్లించాడు . పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన నేపథ్యంలో ఆయన తిరుపతిలో మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుమల తిరుపతి దేవస్థానం చేరుకొని వేంకటేశ్వరస్వామికి తలనీలాలు ఇస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేశానని, అందులో భాగంగానే మొక్కు చెల్లించుకునట్టు చెప్పారు. సీతక్క గెలుపు కోసం కీలకపాత్ర పోషించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా వేములవాడ, కొండగట్టుకు సైతం వెళ్లి మొక్కులు చెల్లించినట్టు సంతోష్ రెడ్డి పేర్కొన్నారు

# 14న సప్త ధామంలో సంక్రాంతి సంబరాలు

### ఉత్తమ మహిళా, ముగ్గుల పోటీల నిర్వహణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** ములుగు రోడ్డు లోని సప్త ధామంలో జనవరి 14 ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని, ఉదయం 9గంటల నుంచిబోగి మంటలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ దుస్తుల ధారణ పోటీలు నిర్వహించబడతాయని మంగళవారం శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. గురుదామంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ పండుగ కూడా అందరూ కలసి సమిష్టిగా జరుపుకోవడానికి సంక్రాంతి సంబరాలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూఉత్తమ మహిళాగా గుర్తింపబడిన మహిళకు రూ.10116, రెండో బహుమతి కింద రూ.5116, మూడో బహుమతిగా రూ.2116 ఇవ్వబడతాయని, అలాగే ముగ్గుల పోటీకి అన్ని జిల్లాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో రావాలని వారికి కూడా మొదటి బహుమతి రూ.3116, రెండో బహుమతి రూ. 2116, మూడో బహుమతి 1116 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే సంప్రదాయ దుస్తుల పోటీలలో పురుషులకు, స్త్రీలకు, పిల్లలకు వేరువేరుగా పోటీలు నిర్వహించి మంచి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. వచ్చిన వారందరికీ మంచి సంప్రదాయ విందు భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సంప్రదాయ పద్ధతులలో సంక్రాంతి సంబరాలలో చండీ హెూమం కూడా నిర్వహిస్తున్నామని కాబట్టి భక్తులందరూ ఉదయం ఎనిమిదిన్నరకు సప్త ధామం ప్రాంగణంలో ఉండాలన్నారు. ఉత్తమ మహిళ, ముగ్గుల పోటీలలో పాల్గొనదలచిన భక్తులు ఫోన్ నెంబర్ 98484 23133కు వాట్సాప్ సందేశం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని, రిజిస్ట్రేషన్ సంఖ్యను పొందవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు గందె ఉమాశంకర్, రేపాల రామచందర్, లాయక్ అహ్మద్, పబ్బతి నరేష్, రేపాల ఆనంద కృష్ణ పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న పోలీస్ అధికారులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో రాణిస్తున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన అదనపు డీసీపీ పి.సంజీవ్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ యం.జితేందర్ రెడ్డిలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందనలు తెలియజేశారు. ఈ నెల 5నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో 55సంవత్సరాల వయస్సు విభాగంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి మిక్సిండ్ డబుల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించగా, సింగిల్స్ విభాగంలో రన్నరప్ నిలవడంతో పాటు డబుల్స్ విభాగంలో అదనపు డీసీపీ సంజీవ్ తో కలిసి ఆడిన డబుల్స్ విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో రన్నరప్ గా నిలిచారు. ఈ పోటీల్లో ఒక గోల్డ్‌తో పాటు రెండు సిల్వర్ పతకాలను సాధించినందుకుగాను ఈ సంవత్సరం మార్చిలో హరియాణలోని పంచాకుల జిల్లాలో జరగబోయే జాతీయ స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలకు ఏసీపీ జితేందర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ అభినందించడంతో పాటు, రాబోయే రోజుల్లో మరిన్ని పతాకాలను సాధించడంతో పాటు నేటి తరం క్రీడాకారులకు అదర్శంగా నిలవాలని సూచించారు.

## ఇంటింటికి అక్షింతలు పంపిణీ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** అయోధ్య రామ మందిరం తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాయంపేట, ఆరేపల్లి, పత్తిపాక గ్రామాలలో మంగళవారం రామయ్య అక్షింతలు పంపిణీ చేశారు. శాయంపేట మండల కేంద్రంలోని శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయంలో మండల సంయోజక గిద్దమారి సురేష్, భారతీయ కిసాన్ సాంగ్ జిల్లా అధ్యక్షుడు లెక్కల జలంధర్ రెడ్డి లక్ష్మి, శ్రీరాముని తీర్థ ఫస్ట్ వరంగల్ జిల్లా సాహసం యువజన ఆర్ఎల్ కే ప్రసాద్ పాల్గొనగా అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాయంపేట ఆరేపల్లి గ్రామాలలో జైశ్రీరామ్.. జయ రామ శ్రీరామ జయ జయ రామ అంటూ భక్తి గీతాలతో గ్రామ ప్రజలకు అక్షింతలు పంపిణీ చేశారు. పత్తిపాక గ్రామంలోని శ్రీరామాంజనేయ ఆలయంలో భక్తుమండలి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాల్పదాసు చంద్రమౌళి, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, కానుగుల నాగరాజు, బాసని విద్యాసాగర్, వనం దేవరాజ్, బాసని నవీన్, గుండారపు బుచ్చిరెడ్డి, ఎడ్డే సుమన్, రాజేందర్, లక్ష్మణ్, రామన్న, మామిడి భరత్, తడక సదానందం, కోనూరు రాజు, వైద్యుల ప్రభాకర్ రెడ్డి, మంద రాజు, శ్రీధర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మహాదేవ స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల కేంద్రంలో గల శ్రీ మహాదేవ స్వామి ఆలయ ప్రాంగణం తృతీయ మహెూత్సవ సందర్భంగా శివ నామం స్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ పుణ్య వచనం, మండ దీపారాధన, మహాదేవ స్వామి కళ్యాణ మహెూత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల ఉపేందర్ గుప్తా-రేణుక దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కల్యాణోత్సవం చేశారు. దీంతో ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ప్రజలకు, భక్తులకు మహెూన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాలకుర్తి దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. స్థానిక పూజారి పిండిపోలు శ్రీనివాస్ శర్మ, ఆర్య వైశ్య సంఘం నాయకులు ఓరుగంటి శంకర్ లింగం గుప్తా, పోకల లింగయ్య, సోమేశ్వర్, సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి, ప్రముఖ వ్యాపారవేత్త కూరెళ్ల కుమార్ గుప్తా దంపతులు, విజయ్ కుమార్ దంపతులు, బచ్చు చిరంజీవిలు, లగిశెట్టి లింగయ్య, రాజేశ్వర్, రమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమోషన్‌లో టెట్ అర్హత పరీక్షను మినహాయించాలి

## టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ కుమార్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** టీపీటీఎఫ్(తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ) ఖిలా వరంగల్ మండల కేంద్రంలో గల స్థానిక ప్రభుత్వ సహాయక ఆర్య బాలుర ఉన్నత పాఠశాలలో వాల్ క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు బెల్లంకొండ పూర్ణచందర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ గౌడ్ హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వాలు విద్యారంగ పటిష్టత పేరుతో అనాలోచితంగా టెట్ పరీక్ష అర్హతను ఉపాధ్యాయుల ప్రమోషన్ కు ముడి పెట్టారన్నారు. అసలే ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి వంటి అనేక ప్రోగ్రాంలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలు కామన్ సర్వీస్ కోర్టు కేసులతో నియామకం అయినప్పటి నుంచి ఒకే పోస్ట్ లో సర్వీస్ పూర్తి చేసుకోని పదవీ విరమణ పొందడం దురదృష్టంగా భావిస్తున్న తరుణంలో ఉపాధ్యాయ లోకానికి టెట్ పరీక్ష అశనిపాతంగా మారుతుందని అన్నారు. మొదటి నుంచి ప్రభుత్వాలు విద్యారంగంలో సంస్కరణ పేరుతో తీసుకు వస్తున్న అనేక విషయాలను టీపీటీఎఫ్ ఎప్పటికప్పుడు విశ్లేషించి టెట్ అర్హత పరీక్షను వ్యతిరేకించిందని తెలిపారు. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు తమ స్వలాభం కోసం నూతన విధానాలను అధ్యయనం చేయకుండానే పాలకుల మెప్పుకోసం తమ మద్దతు ప్రకటించడం వలన విద్యా రంగంలో అనేక సమస్యలకు కారణం అవుతున్నారని విమర్శించారు. కాబట్టి ఎల్లప్పుడూ విద్యా రంగ, ఉపాధ్యాయ పక్షపాతిగా అహర్నిశలు కృషి చేసే టీపీటీఫ్ సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్, సునీత, ఉషారాణి, జోత్న్న తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం మహా దానం




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జీవితాలను రక్షించడంలో,ఆరోగ్య సంరక్షణలో రక్తదానం మహా యోగ్యమని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర అన్నారు. మంగళవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ హన్మకొండ వారు కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ ధర్మేంద్ర విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ వైద్యపరమైన అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు, శస్త్రచికిత్సలలో రక్తాన్ని సకాలంలో పొందడం వల్ల ఒక నిండు ప్రాణాన్ని కాపాడవచ్చున్నారు. క్యాన్సర్, రక్తహీనత, రక్త రుగ్మతలు వంటి అనారోగ్యాలతో బాధపడుతున్న వ్యక్తులకు, వారి జీవణ ప్రమాణ స్థాయిని మెరుగుపరచడానికి క్రమం తప్పకుండా రక్తమార్పిడులు అవసరమని తెలిపారు. రక్తం కృత్రిమంగా తయారు చేయలేని విలువైన వనరని, ఇతరులకు సహాయం చేయడానికి నిస్వార్థంగా తమ విద్యార్థులు 27యూనిట్ల రక్తాన్ని దానం చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిర కార్య నిర్వాహకులు డాక్టర్ కిషన్ రావు, డాక్టర్ మసూద్, రక్తదాన ప్రేరకుడు జి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ మాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అరుణ్ ప్రభాత్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శివసేనా రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి



**వరంగల్ వాయిస్ట భీమదేవరపల్లి :** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివ సేనా రెడ్డికి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి చిదురాల సురేష్ అధిష్ఠానాన్ని కోరారు. లక్షలాది యువజన కాంగ్రెస్ నాయకుల గొంతుక శివ సేనా రెడ్డి అని, తెలంగాణ రాష్టంలో నిరంకుశ బీఆర్ఎస్ పాలనపై విసిగి పోయి ఉన్న రాష్ట్ర యువత, నిర్యుదోగ యువతకు అండగా అనేక ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడికి అవకాశం కల్పిస్తే 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న యువతకు కాంగ్రెస్‌పై మరింతభరోసా కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

## కర్రే నారాయణ సేవలు చిరస్మరణీయం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కర్రే నారాయణ సేవలు చిరస్మరణయమని బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, అంబేద్కర్ సంఘ నాయకులు అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలోని సహృదయ వృద్ధాశ్రమంలో ప్రముఖ బుద్దిస్ట్ కర్రె నారాయణ 5వ సంస్కరణ సభ కార్యక్రమాన్ని ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, అంబేద్కర్ సంఘ రాష్ట్ర నాయకులు పాల్గొని కర్రె నారాయణతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కర్రే నారాయణ జీవిత కాలం మొత్తం అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా జీవించారని కొనియాడారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ కుటుంబ సభ్యులు లక్ష్మీ తులసి, రాహుల్, హిందూ, రామా బాయ్ ఉమెన్స్ ఫెడరేషన్ అధ్యక్షురాలు తరాల రాజమణి, బీఎస్ఐ రాష్ట్ర నాయకులు సురేందర్, బొమ్మల అంబేద్కర్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తరాల సందీప్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కొంగర జగన్, గోపాల్ పూర్ రైతు సేవా సహకార సంఘం ఉపాధ్యక్షుడు బంగ్లా మొగిలి, సీపీఐ రాములు, సమ్మయ్య, ఉట్కూరు రవీందర్, గడ్డం లక్ష్మీనారాయణ, కర్రె కుమారస్వామి, జట్టి విక్రమ్, సుమన్, వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉట్కూరు కార్తీక్, స్వామి రావు పాల్గొన్నారు.

## మెట్టుగుట్టపై మాస శివరాత్రి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, మడికొండ :** ఓరుగల్లు మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారికి లోక కళ్యాణార్థమై ప్రజలు అందరూ కూడా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మహన్యాసపూర్వకంగా రుద్రాభిషేకం నిర్వహించి భక్తులచే అభిషేకం చేయించారు. తదుపరి యాగశాలలో రుద్ర హోమం నిర్వహించి, రామాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కే.శేషు భారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## పిల్లలకు అదనపు ఆహారం అందించాలి



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఆరు నెలలు దాటిన పిల్లలకు అదనపు ఆహారాన్ని ద్రవ పదార్థం ద్వారా తల్లులు అందించి ఆరోగ్యం పట్ల తల్లులు శ్రద్ధ చూపాలని అంగన్వాడీ టీచర్ ఎడెల్లి సునీత సూచించారు. రేగొండ మండల కేంద్రంలోని గడిపల్లె అంగన్వాడీ సెంటర్ లో మంగళవారం అంగన్వాడి టీచర్ ఎడెల్లి సునీత ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీలత, జయంతి, సెంటర్ ఆయా అట్టెం సరోజనలతో ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలతో తల్లులు పాల్గొనగా, వారిని ఉద్దేశించి అంగన్వాడీ టీచర్ సునీత, ప్రభుత్వ ఉపాధ్యాయురాళ్లు శ్రీలత జయంతి మాట్లాడుతూ సంతానం కలిగిన తల్లి పాలు పిల్లలకు ఆరు నెలల వరకు సరిపోతుందని, ఆ తర్వాత అదనపు ఆహారం పట్ల శ్రద్ధ చూపితే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రోజు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం పట్ల శ్రద్ధ చూపించి ద్రవ పదార్థంతో కూడిన సెంటర్ లో ఇచ్చే సత్తుపిండివి వంటివి తయారు చేసి పిల్లలకు అందించాలని వారు సూచించారు. దీంతో పిల్లలు ఆరోగ్యవంతులుగా త్వరితగతిన ఎదుగుదలకు తల్లులు కృషి చేసిన వారవుతారని అంగన్వాడి టీచర్ సునీత అన్నారు.

## కటాక్షపూర్ చెరువు కాలువలకు షెటర్లు బిగింపు



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని హౌస్ బుజుర్గ్ గ్రామంలోని కటాక్షపూర్ పెద్ద చెరువు కింద పెద్ద కాలువకు షెటర్లు మంగళవారం బిగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం కటాక్షపూర్ చెరువు కిందున్న రైతులకు పంట పొలాలకు నీరందించేందుకు చెరువు కాలువలకు షెటర్లు బిగించినట్లు, అదేవిధంగా రైతులకు ట్రాక్టర్లు వెళ్లడానికి 12ఫీట్ల వెడల్పుతో చెరువు కట్ట నుంచి జాతీయ రహదారి వరకు మట్టి దారి సుమారు రూ.29లక్షల వ్యయంతో పనులు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ, ఏఈ, సర్పంచ్ రబియా బి హుస్సేన్, ఉపసర్పంచ్ జి.లావణ్య బాలకృష్ణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఖాసీం, ప్రధాన కార్యదర్శి దామెర రాజు, పెద్దలు రమేష్, ఐలయ్య, సురేష్, మౌల, బొబ్బిలి, సునీల్, అనిల్, దళ్ళం, సత్యం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య సీతారాముల అక్షింతలు వితరణ



**వరంగల్ వాయిస్, రేగొండ :** అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేయాలని అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ క్షేత్ర కమిటీ ఆదేశాల మేరకు అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రాయ పల్లి గ్రామంలో ఇంటింటికి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో వారి ఇంటి దగ్గర నుండి హనుమాన్ దేవాలయం వరకు ర్యాలీగా వెళ్లగా పూజారి కార్తీక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ భక్తులు దాసరి మహేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ రెడ్డి, దాసరి అమృత రెడ్డి, ఇరాజ శేకర్, వైనాల రమేష్, నిటురి సాంబమూర్తి, శోభన్, శ్రీనివాస్, మంద మొగిలి, తనుకు రాజయ్య, రవీందర్ రెడ్డి, నేటూరి మహేందర్, లింగారవు, ఐలయ్య, కన్నం రాజు, గ్రామ పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిట్ వరంగల్‌లో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, నిట్ వరంగల్ :** హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్స్ బంజారాహిల్స్‌తో కలిసి నిట్ వరంగల్ ఇన్‌స్టిట్యూట్ హెల్త్ సెంటర్ వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్ డాక్టర్ హరీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. నిట్ వరంగల్‌లోని 150మందికి పైగా ఉద్యోగులకు ఈసీజీ , 2డి ఎకో, బోన్ మినరల్ డెన్సిటీ(బీఎండీ ) పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్టియో ఆర్థరైటిస్‌పై ఆర్థోపెడిక్ డాక్టర్ హరీష్ ప్రసంగించారు. "ఆస్టియో ఆర్థరైటిస్ కీళ్ల నొప్పులకు దారితీస్తుందని, వృద్ధులలో కనిపించే సాధారణ సమస్యలలో ఇది ఒకటి" అని ఆయన అన్నారు. ఆస్టియో ఆర్థరైటిస్‌ను నివారించడానికి ఆరోగ్యకరమైన బరువును ఉంచడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి సరైన జీవనశైలిని అనుసరించడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు కేర్ హాస్పిటల్స్, ఇన్‌స్టిట్యూట్ హెల్త్ సెంటర్, నిట్ వరంగల్‌కు ఇంఛార్జి రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎన్ .ఉమామహేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ హెల్త్ సెంటర్ ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్ నరసయ్య పాల్గొన్నారు. డా.జి.రాధా రుక్మిణి సీనియర్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ చింతల కార్తీక్, డాక్టర్ ప్రదీప్ దొడ్డా, డాక్టర్ అంచూరి కార్తీక్, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్ కె. అనిత కుమారి, ఇన్ స్టిట్యూట్ హెల్త్ సెంటర్ సిబ్బంది ఈ కార్యక్రమానికి సమన్వయం చేశారు.

## కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** రేపు కొత్తకొండ వీరభద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరగనున్నందున దేవాదాయ ధర్మాదాయ శాఖ తెలంగాణ కమిషనర్ అనిల్ కుమార్‌కు, అడిషనల్ కమిషనర్ కూరాకుల జ్యోతి, విజిలెన్స్ కమిషనర్ కృష్ణవేణి, డిప్యూటీ కమిషనర్ కృష్ణ ప్రసాద్ లకు కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలు అందించి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ యువ కిషన్ రావు అర్చకుడు వీరభద్రయ్య పాల్గొన్నారు.

## సీఐని సత్కరించిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇంతేజార్ గంజ్ నూతన సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పవన్ ను మంగళవారం 26వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేట్ ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొండా దంపతుల వీరాభిమానులు, 26వ డివిజన్ కార్యకర్తలు మంజీత్ సింగ్, మహమ్మద్ ఇబ్రహీం, జీత్ సింగ్, నవీన్ ఆధ్వర్యంలో సత్కరించడం జరిగింది.

## విజయవంతమైన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మై భారత్ వికసిత్ భారత్ అనే అంశంపైన నెహ్రూ యువ కేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ అధ్యక్షతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్ లో నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలలో ముఖ్య అతిథిగా కళాశాల ఇంచార్చి ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అవకాశాలను అందిపుచ్చుకొని లక్ష్యం సాధించాలన్నారు. అందుకు నెహ్రూ యువ కేంద్రం మంచి వేదికని అన్నారు. పై అంశంపై నిర్వహించిన పోటీలో బి.నవ్య, జిల్లా స్థాయి విజేతగా నిలువగా విజేతను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యన్.రంగా రెడ్డి, వి.రాజేందర్, సత్యనారాయణ , గొంగళ్ల అశోక్, అలువాల తేజస్వీ, సుజిత్ పాల్గొన్నారు.

## రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్




**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేటలో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో ఓపీఎస్ ను వెంటనే అమలు చేయాలని కాజీపేట రైల్వే స్టేషన్ ముందు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంఘీభావం తెలియజేశారు. దీక్షలో కూర్చున్న కార్మికులందరికీ పూలమాలలు వేసి దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. కాజీపేట రైల్వే జంక్షన్ ముందు మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి రైల్వే కార్మికుల సమస్యలపై మాట్లాడుతూ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్) విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై రైల్వే కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలియజేస్తూ రైల్వే కార్మికులు వృత్తిలో ఉన్నప్పుడు, పదవీ విరమణ అనంతరం కూడా మనశ్శాంతి లేకుండా కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. రైల్వే కార్మికుల భద్రత పట్ల నిర్లక్ష్యం చేస్తున్నదని, జాతీయస్థాయిలో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ విధానాలను ప్రవేశపెడితే నేడు బీజేపీ మోడీ ప్రభుత్వం వ్యాపార దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ఆస్తులను, సంస్థలను ప్రైవేటు పరం చేయుటకు కుయుక్తులు పన్నుతూ ప్రజల కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు ఇది మంచిది కాదని కొత్త విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న మూడు నెలల్లో మరోమారు దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతున్నదని, తప్పకుండా రైల్వే కార్మికుల సమస్యల పట్ల ఓల్డ్ పెన్షన్ (ఓపీఎస్) విధానాన్ని అమలు జరిగే విధంగా నా వంతు సహాయ సహకారాలు ఉంటాయని కార్మికులకు భరోసా ఇచ్చారు. మీ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ శ్రీ కొత్త మురళీకృష్ణ, కేంద్ర కమిటీ సభ్యులు చింత మురళి, సాదినేని వెంకట్ నారాయణ, ఐఎన్టీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ, లోకో రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్ కుమార్, అభిలాష్, ముస్తాక్ హుస్సేన్, బలివేందర్ సింగ్, లక్ష్మీనారాయణ, రాజలింగం మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ అంకూస్, స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ రజాలి, మాజీ కార్పొరేటర్లు రావుల సదానందం, గోల్కొండ రాంబాబు, అశోక్ నాయకులు సిరి లారెన్స్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ స్పీకర్ సిరికొండను కలిసిన పంజా కల్పన

### బీఆర్ఎస్ ఎంపీ సీటు కేటాయించాలని విన్నపం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి నియోజవర్గం తొర్రూరు డివిజన్ కేంద్రానికి చెందిన పంజా కల్పన వరంగల్ పార్లమెంట్ టికెట్ ఆశిస్తూ తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి అయిన సిరికొండ మధుసూదనాచారిని మర్యాదపూర్వకంగా కలిసి తన బయోడేటాను అందించి తనకు బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ ను కేటాయించేలా చూడాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యార్థిని విద్యార్థులకు తనదైన శైలిలో విద్యా బోధనను అందిస్తూ ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత శిఖరాలకు చేరేలా సహకారాలు అందించడం జరిగిందని తెలిపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చొరవతో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ పాలకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ గా బాధ్యతలు చేపట్టి ట్రస్టు ద్వారా ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులకు గ్రూప్1, గ్రూప్ 2, గ్రూప్4, టెట్, ఉపాధ్యాయ ఎంట్రన్స్ టెస్ట్ లాంటివి మరెన్నో ఉచిత శిక్షణ శిబిరాలతో పాటు ఉచిత భోజన వసతులు కల్పిస్తూ నిరుద్యో యువతి యువకులకు మనోధైర్యాన్ని కల్పించామని పేర్కొన్నారు. మహిళలకు, నిరుద్యోగ యువతీ, యువకులకు, వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవలను బీఆర్ఎస్ పార్టీ గుర్తించి త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి పంజా కల్పనకు టికెట్ కేటాయిస్తే వరంగల్ పార్లమెంటులో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మేధావులు, కళాకారులు, విద్యార్థులు, వివిధ కుల సంఘాల నాయకులు, మహిళా సంఘాల నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** శ్రీబుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రోజును పురస్కరించుకొని శ్రీ స్వామివారికి, అష్టదళ పాద పద్మారాధన సేవ బంగారు పద్మాలతో నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు, ఈ సేవా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ ఈవో బి.లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు బి.రవీందర్ శర్మ, ఎస్.కృష్ణమాచార్యులు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక సంఘసంస్కర్త ఫాతిమా షేక్

### సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** చదువుతోనే సమ సమాజ నిర్మాణం ఏర్పాటవుతుందని, మహిళ విద్యాభివృద్ధికి కృషి చేసిన ఫాతిమా షేక్ గొప్ప సామాజిక సంఘసంస్కర్త అని మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 193వ జయంతి సందర్భంగా మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫాతిమా షేక్ చిత్ర పటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఆల్ అన్సార్ యూత్, మా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని ఫాతిమా షేక్ చిత్ర పటానికి పూలమాల వేసి ప్రసంగించారు. ప్రాచీన కాలంలో విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా ఉండేదని, అలాంటి తరుణంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రీబాయి ఫూలే దంపతులతో కలిసి సమాజంలో ఎదురయ్యే అసమానతలను రూపుమాపుతూ మహిళా అభ్యున్నతికి ఫాతిమా షేక్ కృషి చేశారని తస్లీమా తెలిపారు. సాంఘిక దురాచారాలపై అలుపెరుగని పోరాటం చేసి మహిళ విద్యాభివృద్ధికి ఫాతిమా షేక్ కృషి చేశారని ఆమె సేవలను తస్లీమా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, మహిళలు, ఆల్ అన్సార్ యూత్, మా అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అనిమీయా ముక్తి భారత్ సమన్వయ సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అనిమీయా ముక్తి భారత్ సమన్వయ సమావేశం మంగళవరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కాజీపేట వెంకటరమణ అధ్యక్షతన విద్యాశాఖ అధికారిణి వాసంతితో కలిసి నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం ద్వారా, రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమాన్ని ఆర్బీఎస్ కే వైద్య అధికారులు, సిబ్బందితో కలిసి అన్ని పాఠశాలలో, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నరు. అవసరం ఉన్నవారికి మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని, ఆరోగ్య సమస్యల తీవ్రతను బట్టి జిల్లా ఆసుపత్రులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఇవే కాకుండా ప్రతి సంవత్సరం రెండుసార్లు పిల్లలకు నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ద్వారా పిల్లలందరికీ ఆరోగ్య సిబ్బందిచే వేయుస్తున్నట్లుత పేర్కొన్నారు. తద్వారా పిల్లల్లో రక్తహీనతను, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడం, విద్య పట్ల శ్రద్ధ కలిగించడం, హాజరు శాతాన్ని పెంచడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి నుంచి 12వ తరగతి పిల్లలందరికీ అనీమియా ముక్త భారత్ కార్యక్రమాల ద్వారా రక్తహీనత నిర్మూలన కొరకు వీక్లీ ఐరన్ ఫోలిక్ టాబ్లెట్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు రక్తహీనత కు సంబంధించిన హెచ్ బీ శాతాన్ని తెలుసుకోవడానికి హెచ్ బీ డిజిటల్ మీటర్ ద్వారా రక్త పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయంతో కార్యక్రమంలో పాలుపంచుకొని వైద్య ఆరోగ్య సిబ్బందికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం విద్యాశాఖ అధికారిణి వాసంతి మాట్లాడుతూ ఆరోగ్యశాఖ చెప్పిన విధంగా సమన్వయంతో పాఠశాలలకు వచ్చే 8 తరగతి నుంచి 12వ తరగతి పిల్లలందరికీ అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాలో అందరూ రక్తహీన సంబంధించిన హెచ్ బీ డిజిటల్ మీటర్ ద్వారా పిల్లలందరికీ పరీక్షలు నిర్వహించే విధంగా విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా సహకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, ఆర్ బీఎస్ కే వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## తాటికొండ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

### డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, ఘనపూర్ :** నియోజకవర్గంలోని తాటికొండ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ టీఎస్ ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ మాధవరావును మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తాటికొండ గ్రామానికి గత 35సంవత్సరాల నుంచి బస్సు సౌకర్యం ఉండేదని, కానీ గత 6నెలల నుంచి బస్సు సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తాటికొండ గ్రామ జనాభా సుమారు 7000 వరకు ఉంటుందని, అదేవిధంగా దీని పక్కన కొత్తపల్లి గ్రామంలో 2000 మంది గ్రామస్తులు ఉన్నారని, కాబట్టి గ్రామస్తులకు బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రామకృష్ణ కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళకు ఇచ్చే ఉచిత బస్సు సౌకర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలలో భాగంగా ప్రజలు, ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుటకు ఉపయోగపడుతుందన్నారు. బస్సు సౌకర్యం లేని ప్రతి గ్రామంలో కూడా బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు.

## మంత్రి కొండా సురేఖకు ఐనవోలు జాతరకు రావాలని ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ లోని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను మంగళవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతరకు రావాలని ఆహ్వాన పత్రికను వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు, ఆలయ ఈవో నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్ రెడ్డి, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు కుందూరు వెంకట్ రెడ్డి, వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడి రాజిరెడ్డి, యువ నాయకులు గొట్టిముక్కల రమాకాంత్ రెడ్డి తో పాటు తదితరులు ఆహ్వానం పత్రికను అందించడం జరిగింది.

# కార్మికుల శ్రమను దోచేలా కార్మిక చట్టాలు

### సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేఎల్ మహేంద్ర నగర్ డాక్టర్స్ కాలనీలో మంగళవారం ఏఐటీయూసీ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మేకల రవి, గన్నారపు రమేష్ పాల్గొని మాట్లాడుతూ లేబర్ కార్డు ఉన్న ప్రతి భవన నిర్మాణ కార్మికుడు హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డులు తీసుకోవాలని, కానీ, ఇప్పటి వరకు నిజమైన భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు లేని పరిస్థితులలో ఉన్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులు కూలి కోసం పడిగాపులు కాస్తూ పని దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారని, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా వస్తున్నటువంటి బెనిఫిట్స్ ను పెంచి కార్మికులకు అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ꠰సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను సవరించి యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే విధంగా శ్రామికుల శ్రమను దోచే విధంగా తయారు చేసి కార్మికులను కట్టుబానిసలుగా చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాల పరిరక్షణకై, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుట కోసం బ్రిటిష్ సామ్రాజ వాదులకు వ్యతిరేకంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బుస్స రవీందర్, ఎండీ కాసీం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సంర కుమార్, మందు అయిలయ్య, కేఎల్ మహేంద్ర నగర్, సీపీఐ శాఖ కార్యదర్శి పరికరాల రమేష్, ఎండీ అక్బర్, షబానా, అంజద్, వరలక్ష్మి, ఖైరున్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత




**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రానికి చెందిన నాగూర్ వలీ ఎయిర్ టెల్ లో ప్రమోటర్ గా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఎయిర్ టెల్ పేమెంట్ బ్యాంకు ద్వారా మంజూరైన రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును స్థానిక ఎస్సై దేవేందర్, ఎయిర్ టెల్ పేమెంట్ బ్యాంక్ జెడ్ఎమ్ శంకర్ నర్సింగ్ మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ టెల్ టీఎం రవికాంత్, రఫీ, మండల డిస్టిబూటర్ బాసర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ



**వరంగల్ వాయిస్, మామునూర్ :** నాలుగో బెటాలియన్"ఇ"కంపెనీ యాన్యువల్ రిప్రెషర్ కోర్సులో భాగంగా నాలుగో బెటాలియన్ కమాండెంట్ డి. శివ ప్రసాద్ రెడ్డి ఆదేశానుసారం మంగళవారం పున్నెల్ క్రాస్ రోడ్ దగ్గర ఉన్న కనకదుర్గ వృద్ధాప్య ఆశ్రమాన్ని నాలుగో బెటాలియన్"ఇ" కంపెనీ సిబ్బంది సందర్శించి వృద్ధులకు నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు రాంబాబు, వేణుగోపాల్ రెడ్డి పాల్గొని వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు మనోజ్, మహేష్, సురేష్, ఇ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

## రామా శ్రీనివాస్ మృతిపై కేటీఆర్, హరీష్ రావు సంతాపం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపకుడు రామా శ్రీనివాసు మంగళవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కే టీ రామారావు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేశం హైదరాబాద్ సోమాజిగూడ లో వారి స్వగృహానికి వెళ్లి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యంగా ఉండాలని సూచించారు.



## కొనసాగుతున్న అభయహస్తం దరఖాస్తుల ఎంట్రీ

### 95 వేల దరఖాస్తుల కంప్యూటరీకరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బల్దియా వ్యాప్తంగా అభయహస్తం దరఖాస్తుల నమోదు ప్రక్రియ చురుకుగా కొనసాగుతుంది, 66 డివిజన్ల వ్యాప్త గా 2,82,820 దరఖాస్తులు స్వీకరించిన క్రమంలో ఆ దరఖాస్తుల నమోదు ప్రక్రియ 2రోజులుగా నిరాటంకంగా కొనసాగుతుంది. ఇప్పటి వరకు సుమారు 95 వేల దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఒక్క రోజు సుమారు 50వేల దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి అయినట్లు అధికారులు పేర్కొన్నారు.



# శభాష్.. సుభాష్

- గడ్డం కేశవమూర్తి

**రాజకీయాలు ప్రజాసేవకే అని నమ్మిన వ్యక్తి లేకుంటే చరిత్ర హీనులే**

**కలిసొస్తున్న తండ్రి రాజకీయ అనుభవం**

**బీజేపీ అభ్యర్థిగా వరంగల్ పార్లమెంట్ బరిలోకి..?**

**క్షేత్రస్థాయిలో పావులు కదుపుతున్న నేత**

**వర్తమానాన్ని వృథా చేయకుండా, భవిష్యత్ గురించి ఆలోచించే వాడే నిజమైన నాయకుడు. గతం ఎంతటి ఘనమైనదైనా అదే పట్టుకుని వేలాడకుండా, ప్రస్తుతానికి మనమేంటి.. గతంతో పోల్చితే మనం సాధించాల్సింది ఎంత..? అని దూర దృష్టితో ముందుకెళ్లేవాడే ప్రజానాయకుడు. ఎంతటి ఘన చరిత్ర ఉన్నా అంతా మనమే.. అందరూ మనోళ్లే.. అందరి కోసం చేయాల్సింది మిగిలే ఉందని ఆలోచన చేస్తే వద్దన్నా జనం మన వెంటే నడుస్తారు. ఏది ఏమైనా తాతలు, తండ్రుల పేరు చెప్పి అమాంతం ఎగిరొచ్చి కుర్చీలో కూర్చుంటానంటే అలాంటి నాయకుడి మనుగడకే ముప్పు.. అదే క్రమక్రమంగా ఎదిగొచ్చే నాయకుడంటే ఎవ్వరైనా శభాష్ అని మెచ్చుకోవాల్సిందే. సరిగ్గా అదే కోవకు చెందినవారు బొజ్జపెల్లి సుభాష్. తండ్రి రాజకీయ అనుభవాలను తనకు దారిగా మలుచుకున్నారే తప్ప ఆధారపడి తను దగ్గరి దారి వెతుక్కోని నిజమైన నేత అతడు. రాజకీయాలను ప్రజాసేవలకు వినియోగించాలేగానీ ప్రజలు ఛీత్కరించేలా చేస్తే చరిత్ర హీనులం అవుతామని ప్రాక్టికల్ గా నిరూపిస్తున్న వ్యక్తి.**





## తండ్రి వారసత్వంగా ప్రజల్లోకి..

బొజ్జపెల్లి సుభాష్ తండ్రి బొజ్జపెల్లి రాజయ్య. ఉమ్మడి వరంగల్ జిల్లాకు పరిచయం అక్కర్లేని పేరు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసిన అనుభవం. ప్రజలతో ఎంతో అన్యోన్యమైన సంబంధాలు నెరిపిన నాయకుడు. తండ్రి రాజకీయాల్లోకి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సమయంలోనే బొజ్జపెల్లి సుభాష్ అన్ని గమనిస్తూ పెరిగారు. ప్రజల కష్టాలు, నాయకుల నుంచి వారు కోరుకునే విషయాలు, క్షేత్రస్థాయిలో నేతలు చేయాల్సిన పనులు, పార్టీల విధానాలతో సామాన్యులు పడే ఇబ్బందులు, ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజలు ఓటేసి గెలిపించిన నాయకుడు ఎలా ఉండాలో.. ఎలా ఉండకూడదో బొజ్జపెల్లి సుభాష్ స్వయంగా తండ్రి వారసత్వంగా గమనిస్తూ రాజకీయ ప్లాట్ ఫాంను నిర్మించుకున్నారు.

## అన్యాయం జరిగితే తట్టుకోలేడు..

సమాజంలో అణగారిని వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని చూశారు. చట్టసభల్లో ప్రజల కోసం నాయకులు గొంతు పెకిలించాల్సిన సందర్భాలను దగ్గరుండి మరీ గమనించారు. సంక్షేమ ఫలాలు నిజమైన లబ్ధిదారుడికి చేరడానికి ఎన్ని దారులు దాటుకుని రావాలో, ఎంతగా నిరీక్షణలు చేయాలో స్వయంగా తెలుసుకున్నారు. అందుకే తెలుగు యువత జనరల్ సెక్రటరీగా, ప్రస్తుతం బీజేపీ నేతగా ప్రస్థానం కొనసాగిస్తున్న బొజ్జపెల్లి సుభాష్ తనలోని ఫైర్ ను ఎప్పటికీ చల్లారనివ్వలేదు. సామాన్యుడికి ఏదైనా అన్యాయం జరిగిందని తెలిస్తే అంతెత్తుకు లేచే తత్వం ఆయనది. సమస్య ఎక్కడున్నా వెంటనే వాలిపోయి దాని అంతు చూసే వరకు పట్టువదలని వ్యక్తిత్వం. మరీ ముఖ్యంగా అటు వర్ధన్నపేట నియోజకవర్గంలో, ఇటు పరకాల నియోజకవర్గంతో ఆయనకు ప్రత్యేక అనుబంధాలున్నాయి. తాజాగా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో సుభాష్ కు తెలియని వ్యక్తి, ఆయన తొక్కని గడప లేదంటే అతిశయోక్తి కాదేమో. నియోజకవర్గంలోని 290 బూత్ లలో ప్రతీ ఒక్కటి ఆయనకు తెలుసు. 2,40,000 మంది ఓటర్లకూ ఆయన అత్యంత కావాల్సిన వాడే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రత్యేక వ్యూహాలు రచించి అహర్నిశలు శ్రమించారు.

## వరంగల్ పార్లమెంట్ బరిలో..

భారతీయ జనతాపార్టీకి వరంగల్ లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో లభించిన ఓటు బ్యాంక్ ఎంతో ఆశాజనకంగా ఉందంటే కారణం అందులో బొజ్జపెల్లి సుభాష్ పాత్ర మరువలేనిది. పార్టీ అధిష్టానం, అందునా బీజేపీ





రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అప్పగించిన పనిని తూచా తప్పకుండా నిర్వర్తిస్తూ అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో కష్టపడ్డారు. మూడేళ్లుగా వరంగల్ చుట్టుపక్కల నియోజకవర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థుల గెలుపు కోసం స్పష్టమైన విధివిధానాలతో ముందుకెళ్లారు. అన్ని నియోజకవర్గాల్లో ఆయనకు ఎంతో ప్రజాదరణ ఉంది. ఎక్కడికెళ్లినా 'మా సుభాషన్నా.. మా సుభాషన్నా..' అని పిలుచుకునేంత అప్యాయతను ఆయన సంపాదించుకున్నారు. దేశం మొత్తం కమలం గాలి బలంగా వీస్తున్న ప్రస్తుత సందర్భంలో వరంగల్ వంటి అర్బన్, సెమీ అర్బన్ కలగలిపిన నియోజకవర్గంలో బీజేపీకి మంచి ఆదరణే ఉంది. అందుకే దానిని ఎలాగైనా కైవసం చేసుకోవడానికి బొజ్జపెల్లి సుభాష్ వంటి నాయకుడిని బరిలో నిలిపితే ఫలితం ఆశాజనకంగా ఉంటుంది అనేది రాజకీయ విశ్లేషకులే ఒప్పుకుంటున్న విషయం. అందునా సుభాష్ కు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న సంబంధాల గురించి ఎంత చెప్పినా తక్కువే. అవన్నీ ఆయనకు ప్రత్యేక బలంగా, ప్రజలంతా ఆయనకు బలగంగా మారి గెలిపించుకోవడం పెద్ద విషయమేమీ కాదు.

## ప్రొఫైల్

**బొజ్జపెల్లి సుభాష్**

**వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం**

**తండ్రి :** బొజ్జపెల్లి రాజయ్య , మాజీ ఎమ్మెల్యే స్టేషన్ ఘన్ పూర్ (1984-89), పరకాల (1999-2004)

### రాజకీయ ఎంట్రీ..

**2002 నుంచి 2004 వరకు తెలుగు దేశం యువత జిల్లా జనరల్ సెక్రటరీ**
**2020లో కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరిక**

### అనుభవం..

- 290 బూత్‌లలో 2,40,000 ఓటర్లతో స్టేషన్ ఘన్ పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పనిచేశారు.
- బీజేపీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని దగ్గరుండి విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు.
- మూడు సంవత్సరాలుగా అసెంబ్లీ అభ్యర్థులకు బలం చేకూర్చే కార్యక్రమాలను ముందుండి నడిపించారు.

### విద్యార్హతలు..

- పాఠశాల విద్య (బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్)
- బీకాం (నిజాం కాలేజి)
- ఎంఏ, ఎంఫిల్ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్)

### పార్టీ కోసం చేసిన సేవలు..

- బూత్ స్వశక్తి కరణ్ అభియాన్, అవగాహన కార్యక్రమాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై వీరోచితంగా పోరాటాలు., పార్టీ పిలుపునిచ్చిన ప్రతి సందర్భంగా ముందుండి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా ఆదుకోవడం, వారి కనీస అవసరాలు తీర్చడం.
- స్టేషన్ ఘన్ పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పనిచేయడం, అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు శ్రమించడం.
- ప్రజలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, స్వచ్ఛందసంస్థలతో ప్రత్యేక అనుబంధాలను నెరపడం., స్పెషల్ గా కార్యక్రమాలు చేపట్టడం.
- వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీకి మంచి బలంతో గెలుపొందేలా పార్టీని తీసుకెళ్లే ప్రయత్నంలో సుభాష్ అప్రతిహతంగా ముందుకు కదులుతున్నారు.
- భూపాలపల్లి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో తన తండ్రి సేవలు తెలియడమే కాకుండా, ఇంకా ప్రజలకు చేయాల్సిన పనులపై చాలా స్పష్టతతో ఉన్నారు.
- స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో ఎంతో చక్కని పేరు ప్రఖ్యాతులు, పరిచయాలున్న నాయకుడిగా గుర్తింపు..
- నియోజకవర్గాల వారీగా కుటుంబ సంబంధాలు, స్నేహ బంధాలు, ప్రజలతో మమేకమైన ప్రజలతో మంచి అనుబంధం ఉండడం కలిసొచ్చే అంశం.





# నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

## ఆర్‌సి తడక కుమార్ స్వామి గౌడ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతీ ఒక్కరు ఉదయం, సాయంత్రం తప్పక వాకింగ్ చేయాలని ఆర్ సి తడక కుమార్ స్వామి గౌడ్ సూచించారు. ఇంటర్ నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భద్రకాళి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ కు లభించిన జ్ఞాపికను మంగళవారం ఉదయం ట్యాంక్ బండ్ పై వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మార్తా రాజేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ సి తడక కుమార్ స్వామి మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో వాకర్స్ కు ఇబ్బందులు కలిగించేలా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ఇంటర్ నేషనల్ వాకర్స్ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు వాకర్స్ అసోసియేషన్ లో సభ్యత్వం తీసుకోవడంతోపాటు ఐడీ కార్డును పొందాలను సూచించారు. ఈ కార్డు అన్ని రకాలుగా ఉపయోగ పడుతుందన్నారు. ఐడీ కార్డు ఉన్నవారికి అన్ని రకాలుగా గుర్తింపు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అదే విధంగా వాకర్స్ కు ఎల్లవేలలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరిస్తున్నామన్నారు. త్వరలోనే కేఎంసీ పెద్దలతో మాట్లాడి అక్కడికి వచ్చే వాకర్స్ కు ప్రయోజనం చేకూర్చుతామన్నారు. మనందరం ఐక్యతతో ఉన్నప్పుడే వాకర్స్ సమస్యలను పరిష్కరించుకోగలుగుతామన్నారు. హక్కుల కోసం అవసరమైతే ర్యాలీలు నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి వాకర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేలా విజ్ఞప్తి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన గవర్నర్ ఎల్లా గౌడ్, భద్రకాళి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మార్తా రాజేందర్, ప్రధాన కార్యదర్శి కూచన రాజు, కోశాధికారి చిన్నారి శ్రీధర్, పిన్నింటి కిషన్ రావు, గాలి విద్యా సాగర రావు, సుధాకర్ రెడ్డి, వాకర్స్ మిత్రులు పాల్గొన్నారు.

# ఐనవోలు జాతరకు రండి

## సీఎంకు ఆహ్వాన పత్రిక అందించిన మంత్రి, ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతరకు రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి శ్రీ మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందజేయడంతోపాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు (జాతర) కు రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. మకర సంక్రాంతి మొదలు ఉగాది వరకు మూడు నెలల పాటు మల్లన్న జాతర వైభవంగా జరుగుతుందని సీఎంకు వివరించారు. డప్పు చప్పుళ్లు, ఒగ్గు కథలు, శివపార్వతుల కల్యాణాలు, శివసత్తుల పూనకాలు, మల్లన్న పట్నాలు, బోనాలతో మూడు నెలల పాటు సందడి నెలకొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్ రెడ్డి, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్ రావు, సీనియర్ నాయకులు కుందూరు వెంకట్ రెడ్డి, వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడి రాజిరెడ్డి, యువ నాయకులు గొట్టిముక్కల రమాకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాగడాలు, కాకర వత్తులతో హారతి

## అంగరంగ వైభవంగా సాగుతున్న ధనుర్మాసోత్సవాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని శ్రీ బాలా నగర వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. 24 వ రోజు మంగళవారం సందర్భముగా ఆలయంలో కాగడాలు, కాకర వత్తులతో హారతి ఇచ్చి ప్రత్యేక ఆకర్షనగా నిలిచారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కదంబ ప్రసాద వితరణ జరిపించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎలపాటి రత్నాకర్ రెడ్డి, చైర్మన్ శ్రీనివాసా చార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది సేవా సమితి సభ్యులు గోవింద రాజులు, నందకిషోర్, లక్ష్మణ్, యాదా శ్రీనివాస్, అశోక్, వెంకటేశ్వర్లు, మాధవి, లక్ష్మి, సుధ, కన్య, శ్రీలక్ష్మి, మాధురి, రమ్య తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఆలయంలో అమ్మ వారికి గాజుల అలంకరణ ఉంటుందని, అదేవిధంగా అయోధ్యలో శ్రీ రామ చంద్ర స్వామి ప్రతిష్టాపన సందర్భంగా ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు ఆలయం ముందు భక్తులచే అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రత్నాకర్ రెడ్డి తెలిపారు.



# ప్రజల ప్రయోజనాలే మాకు ముఖ్యం

## టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజలతో ఎన్నుకోబడి కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏపీ సీఎం జగన్ కలవకపోవడం దురదృష్టకరమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. దీనిపై వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నాని కుసంస్కారంగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. మంగళవారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చినపుడు స్థానిక సీఎంను కలవడం ఆనవాయితీ అన్నారు. జగన్ దీన్ని పాటించకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో ఉమ్మడిగా ఉన్న ఏపీ-తెలంగాణ మధ్య అనేక అంశాలు పెనవేసుకొని ఉన్నాయన్నారు. ప్రధానంగా విభజన సమస్యలు, నీటి పంపకాలు, విద్యుత్, ఉద్యోగుల అంశాలు మాట్లాడుకోవాల్సి ఉందన్నారు. కానీ, జగన్ వ్యక్తిగత అంశాల కోసమే వచ్చి, ప్రజా ప్రయోజనాలను విస్మరించారని దుయ్యబట్టారు. ఈ విషయాలన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. తప్పులన్నీ వారివైపు ఉంటే, వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నాని అహంభావంతో మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఏపీలో జగన్ మరో మూడు నెలల ముఖ్యమంత్రి మాత్రమే అన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో తెలంగాణ ప్రజలు పూర్తి స్థాయిలో సంతోషంగా ఉన్నారన్నారు. ఇక్కడ అహంభావంతో మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు అడ్రస్ లేకుండా పోయారన్నారు. ఏపీలో కూడా విర్రవీగుతున్న వైసీపీ అడ్రస్ లేకుండా పోవడం ఖాయమన్నారు.

# మిర్చికి రూ.25వేలు మద్దతు ధర ప్రకటించాలి

## ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్



వరంగల్ వాయిస్, కాశిబుగ్గ : రైతులు పండించిన మిర్చి పంట క్వింటాకు రూ.25 వేలు కనీస మద్దతు ధర ప్రకటించి, మార్కెట్ దోపిడీని అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం అఖిలభారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర బాధ్యులు గోనె కుమారస్వామి, ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి ఇస్మాయిల్, కుసుంబ బాబూరావు తదితరుల బృందం మిర్చి యార్డులో పర్యటించి ధరల పరిస్థితి, రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు మిర్చి రేటు తగ్గడంతో తమకు తీవ్రంగా అన్యాయం జరిగిందని నాయకులతో తమ ఆవేదనను వెలిబుచ్చారు. కుంటి సాకులతో ధరలు తగ్గిస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద రెండో మార్కెట్ అయినా ఏనుమాములలో అంతర్జాతీయ మార్కెట్ కు అనుగుణంగా మిర్చికి ధర లభించక అన్యాయం జరుగుతోందన్నారు. కనీసం మార్కెట్లో ప్రకటించిన జెండా పాట ప్రకారంగా నైనా మిర్చి పంట కొనుగోలు చేయక పోవడం దోపిడీకి నిదర్శనం అన్నారు. ప్రకటించిన జెండా పాటకు అమలయ్యే ధరకు రూ.8,000 వరకు క్వింటాకు తేడా ఉంటుందన్నారు. మిర్చి రైతుకు ఎకరం పంట పండించడానికి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతోందని, దిగుబడి మాత్రం ఐదు నుంచి పది క్వింటాలు మాత్రమే వస్తున్నదన్నారు. దీంతో పంట పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మార్కెట్ లో యథేచ్ఛగా మిర్చి రైతులు దోపిడీకి గురవుతున్నా మార్కెట్ యంత్రాంగం, ప్రభుత్వం చోద్యం చూస్తోందని దుయ్యబట్టారు. అలాగే మిర్చి తాలుకు ఎలాంటి జండా పాట లేకపోడంతో ఇష్టానుసారంగా వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపరుస్తున్నారన్నారు. తక్షణమే మిర్చి రైతులను దోపిడీ చేస్తున్న మధ్య దళారులు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాలు మిర్చికి కూడా జెండా పాట పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కార్యదర్శి, ఉన్నత అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో మార్కెట్ ను సందర్శించి మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాలు మిర్చి రైతుల గోడును అర్థం చేసుకొని క్వింటా మిర్చి కనీస మద్దతు ధర రూ.25 వేలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ఐతం నాగేష్, పరిమళ గోవర్ధన్, రాజు, శ్రీనివాస్, జక్కా అశోక్, అన్నెబోయిన ప్రేమలత, రవి వీరన్న, బాబు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com